చేసింది గోరంత.. చెప్పేది కొండంత

అడ్డగుట్ట, ఆగస్టు 20 : రుణమాఫీపై తప్పుడు ప్రకటనలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్‌గౌడ్ (పెద్దన్న) ప్రభుత్వ తీరుపై మండిపడ్డాడు. మంగళవారం విజయపురి కాలనీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ చేసింది గోరంత అయితే.. కొండంత చేసినట్లు చెప్పుకోవడం మోసపూరిత ధోరణికి నిలువెత్తు నిదర్శనమన్నారు. రుణమాఫీ కాలేదని ప్రశ్నించిన రైతులపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడంతో పాటు అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు రాజులుగా బతికారని, పదేండ్ల కేసీఆర్ పాలనలో హింసకు తావులేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడవకముందే అన్నం పెట్టే రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశా రు. షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఒకవేళ రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని రామాలయం వీధిలో చెట్టుకొమ్మలు విరిగి ఇంటిపై పడ్డాయని తెలియడంతో అక్కడకు చేరుకున్న కార్పొరేటర్ హేమ

మారేడ్‌పల్లిలో రోడ్డుపై నెలకొరిగిన భారీ వృక్షం, పరిశీలిస్తున్న కార్పొరేటర్ దీపిక

మహ్మద్‌గూడ నాలా పరివాహక ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఆగస్టు 20 : వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ హేమ అన్నారు. సోమవారం రాత్రి సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని రామాలయం వీధిలో చెట్టుకొమ్మలు విరిగి ఇంటిపై పడ్డాయని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ స్పందించారు. వెంటనే డీఆర్ఎఫ్ టీంతో కొమ్మలను తీయించారు. భారీచెట్లు పడిపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయాలపై అధికారులతో చర్చించి, పరిశీలిస్తున్నామన్నారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్ఎఫ్ టీం మెంబర్స్ అమర్, ఖాదర్ పాషా, పరుశురాం పాల్గొన్నారు.

నాలా పరీవాహక ప్రాంతంలో పర్యటన..

సికింద్రాబాద్, ఆగస్టు 20 : వరుసగా కురుస్తున్న వర్షాలకు డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. మంగళవారం మహ్మద్‌గూడ నాలా పరీవాహక ప్రాంతంలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలా నుంచి మురుగునీరు ఇండ్లలోకి వచ్చాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. వరద నీరు ఇండ్లలోకి రాకుండా నాలా గోడఎత్తు పెంచడానికి టెండర్ పెట్టామని, చర్యలు చేపట్టి టెండర్ ప్రాసెస్ పూర్తిఅయ్యాక పనులు చేపడతామని కార్పొరేటర్ స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ కౌషిక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

మోండా డివిజన్‌లో భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం..

మారేడ్‌పల్లి, ఆగస్టు 20 : మోండా డివిజన్‌లో మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షాలనికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిప్రాంతాల్లో రోడ్లపై చెట్లు నెలకొరిగాయి. వెంటనే జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయచర్యలు చేపట్టారు. రెజిమెంటల్ బజార్, సెకండ్ బజార్, బండిమెంట్, నాలా బజార్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది నీరుసాఫీగా వెళ్లే విధంగా చర్యలు తక్షణం స్పందించారు. మారేడ్‌పల్లిలో ఓ భారీ వృక్షం నెలకొరడంతో కార్పొరేటర్ కొంత దీపిక ఘటనా స్థలానికి చేరుకొని సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి రోడ్డుపై కూలిన చెట్టును తొలగించి వాహనాదారులు రాకపోకలు సాగించే విధంగా చూశారు. మారేడ్‌పల్లి, అంబేద్కర్ నగర్, రెజిమెంటల్ బజార్ ప్రాంతాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ జీహెచ్ ఎంసీ సిబ్బందితో కలిసి పర్యటించారు.

రెజిమెంటల్ బజార్‌లో సహాయక చర్యల్లో పాల్గొన్న జీహెచ్ఎంసీ సిబ్బంది, కార్పొరేటర్ కొంతం దీపిక

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ర్యాలీలో పాల్గొన్న బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ ప్రజలకు సూచించారు.దోమల నివారణ దినం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మంగళవారం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పడేసే కూలర్లు, పాత టైర్లతో దోమల ఉత్పత్తి పెరిగే ప్రమాదముందని, వాటిని పడేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు, పరిసరాలను శుభ్రం చేసుకునేందుకు ప్రతి వారం సమయం కేటాయించాలన్నారు. దోమలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ ఎంటామాలజీ విభాగం సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

బన్సీలాల్‌పేట్ : దోమలను నివారించడం అందరి బాధ్యత అని ఎంటామాలజీ అధికారి బి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బోయిగూడలో ఎంటామాలజీ విభాగం ఆధ్వర్యంలో ' దోమల నివారణ దినం' సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటి పైకప్పులో టైర్లు, కూలర్లు, కొబ్బరి బోండాం లాంటి వాటిలో నీరు నిల్వ ఉండడంతో లార్వా అభివృద్ధి చెంది దోమలు పెరుగుతున్నాయన్నారు. నిల్వఉన్న నీటిలో ఉన్న లార్వాను ఆయన చెంచాలో వేసి ప్రజలకు చూపించారు. ప్రజల సహకారంతోనే దోమలను నివారించగలమన్నారు. పాఠశాలలు, కాలేజీలు, కాలనీలు, బస్తీల్లో ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఎఫ్ఏలు రాజు, రాజేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై బోయిగూడలో అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎంటామాలజీ విభాగం అధికారులు, సిబ్బంది

అధ్వానంగా రోడ్లు

అమీర్‌పేట్, ఆగస్టు 20 : సనత్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీలో రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. ప్రధానంగా హనుమాన్ ఆలయానికి చేరుకునే మార్గాలు అధ్వానంగా మారాయన్నారు. మంగళవారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు లింగంపల్లి నర్సింగరావు సహా సీనియర్ నాయకులు ఎ.దయానంద్, లక్ష్మీ నారాయణ, ఆకూరి శ్రీనివాస్‌రావు, సిర్మనీ నరేష్, సుధాకర్ ముదిరాజ్, ఆనంద్, వెంకటరమణ, శ్రీనివాస్‌లు ఎస్ఆర్‌టీ క్వార్టర్లతో పాటు డివిజన్‌లోని సుభాష్‌నగర్, జయ భారతి స్కూల్ చౌరస్తా నుండి బస్‌స్టాండ్ వరకు, కూరగాయల మార్కెట్ రోడ్డు ప్రాంతాలను సందర్శించారు. వివరాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్‌కు అందజేస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.

ఎస్ఆర్‌టీ క్వార్టర్లలో రోడ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఆయుష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఎస్ఆర్ నగర్ వయోధికుల మండలి కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వయోధికులకు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ విభాగం వైద్యులు డాక్టర్ ఎన్.జయశ్రీ, డాక్టర్ రవి నాయక్, డాక్టర్ వేణు సుకుమార్, ఫార్మాసిస్ట్ అలివేలు తమ సిబ్బందితో కలిసి 80 మందికి మధుమేహం, రక్తపోటు, మోకాళ్లు, కీళ్లు, నడుము నొప్పులు, అజీర్తి, కడుపులో మంట వంటి సమస్యలకు మందులను ఉచితంగా అందజేశారు. వయోధికుల మండలి అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరం నిర్వహణలో మండలి ప్రతినిధులు పాల్గొని ఏర్పాట్లు పరిశీలించారు. - అమీర్‌పేట్

ఆస్ట్రానమీ విభాగంలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20 : ఓయూ ఆస్ట్రానమీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎన్‌జీఆర్ఐ ప్లానిటరీ సైన్సెస్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సెంథిల్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. 1963వ బ్యాచ్‌కు చెందిన శర్మ బ్రహ్మానంద మొదలి అందించిన విరాళంతో ల్యాబ్ ఏర్పాటు చేయడం విశేషం. శర్మ ఓయూలో పీజీ పూర్తి చేసి, ఆస్టిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తాను చదువుకున్న కళాశాలకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతో రూ.3.6 లక్షలతో అత్యాధునిక కంప్యూటర్లు, ఏసీని సమకూర్చి, ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య, ఆస్ట్రానమీ విభాగం హెడ్ డాక్టర్ శాంతి ప్రియ, బీవోఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సెంథిల్ కుమార్

'రైల్వే ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలి'

ఎంపీ కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20 : రైల్వే ఇంజినీర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దీకొండ పద్మనాభం విజ్ఞప్తి చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలను కలిసి వినతిపత్రం అందజేశారు. పద్మనాభం మాట్లాడుతూ.. రైల్వేలో గ్రూప్ – బీ ఇంజినీర్లకు గెజిటెడ్ హోదా సాధనకు సహకరించాలని కోరారు. రైల్వేలో ఇంజినీర్లు సెక్షన్ ఇంజినీర్‌గా ఉద్యోగం పొంది, అదే హోదాలో ఉద్యోగ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసివేసిన రైల్వే ప్రింటింగ్ ప్రెస్ తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మండప నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి

బేగంపేట్ : హర్యాన భవన్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సర్దార్‌సింగ్

బేగంపేట్, ఆగస్టు 20 : ప్రజలకు అసౌకర్యం కలుగకుండా గణేశ్ మండప నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని మహంకాళి డివిజన్ ఏసీపీ సర్దార్‌సింగ్, ,ఇన్‌స్పెక్టర్ పరశురాం సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘం హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు సూచించిన నిబంధనలు పాటించాలని, శాంతియుత వాతావరణంలో పండగను నిర్వహించాలని, డీజే సౌండ్ సిస్టంలను పెట్టవద్దన్నారు. రాంగోపాల్‌పేట్ పోలీసులు ప్యారడైజ్ హర్యాన భవన్‌లో గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం అయ్యారు. పోలీసులు వారికి సలహాలు, సూచనలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు.

వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ : వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఓయూ డివిజన్ ఏసీపీ గ్యార జగన్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. గణేశ్ మండపాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితి తీసుకువస్తే ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ, నల్లకుంట సీఐలు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ గ్యార జగన్

అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం , ఎంకాం (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ అన్ని కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుంతో 27 లోగా చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును 27 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని, వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను వెబ్‌సైట్ www. osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీల మార్పు

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (ఏఐసీటీఈ), బీఈ (నాన్ సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

యువతను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతాం

బాలంరాయి చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీ గణేశ్



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

మారేడ్‌పల్లి, ఆగస్టు 20 : యువతను అన్నిరంగాల్లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతిని పురస్కరించుకొని బాలంరాయి చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్, మురళి, సదానంద్ గౌడ్, బద్రినాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, నయీం, బల్వంత్‌రెడ్డి, ఆశ్రఫ్, జమీల్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ : రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చిలకలగూడలోని రాజీవ్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గ అధ్యక్షురాలు కల్పన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీతాఫల్‌మండి రెయిన్‌బో హోంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.

సీతాఫల్‌మండి రెయిన్‌బో హోంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న సికింద్రాబాద్ నియోజకవర్గ అధ్యక్షురాలు కల్పన

సీతాఫల్‌మండి చౌరస్తాలో..

సీతాఫల్‌మండి చౌరస్తాలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బండి అభిషేక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు రవి, సీనియర్ నాయకులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, పాపాలాల్, విద్య, యూత్ నాయకులు సందీప్, సాయియాదవ్, సాయి కిరణ్, సాయి, బబ్లూ పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమీర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుద్ధనగర్ బస్తీలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి డాక్టర్ కోట నీలిమతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్, కృష్ణయాదవ్, గుడిగె సత్యనారాయణ యాదవ్ త పూలమాల వేసి నివాళులర్పించారు. - అమీర్‌పేట్

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా న్యూ బోయిగూడ ఐడీహెచ్ కాలనీలోని ఆయన విగ్రహానికి బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. - బన్సీలాల్‌పేట్

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని మంగళవారం బోయిన్‌పల్లిలో నిర్వహించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, సదా, రాజు, ముఖేష్, రియాజ్, అరుణ్ యాదవ్, హరి, లక్ష్మణ్ పాల్గొన్నారు. - బొల్లారం

నేడు మెట్టుగూడలో ఓపెన్ జిమ్ ప్రారంభం

అడ్డగుట్ట, ఆగస్టు 20 : మెట్టుగూడ కేశవ్‌నగర్ పార్కు, ఆలుగడ్డ బావి ప్రాంతాల్లో ఓపెన్‌జిమ్‌ల ప్రారంభానికి ఏర్పాట్లు చేశామని బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు జహంగీర్ ప్రకాశ్ ముదిరాజ్ మంగళవారం తెలిపారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం (నేడు) ఉదయం 9:30 గంటలకు జిమ్‌లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానంతోనే ప్రశాంతత

బన్సీలాల్‌పేట్ : శ్రీశ్రీ గోపాలదాస్ భజన మండలి గురుపూజ వార్షికోత్సవాలు బన్సీలాల్‌పేట్ హిందూ శ్మశాన వాటికలోని మఠంలో నిర్వహించారు. మఠం పీఠాధిపతి డి.శరణ్‌దాస్ (శంకర్‌బాబు) ఆధ్వర్యంలో జరిగిన సత్సంగ్‌లో మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ కబీర్‌దాస్ మఠం నుంచి సంత్ బోధ్ ప్రియ సాహెబ్, విజిత్ సాహెబ్, భీష్మ శరణ్, సునిత సాహెబ్, శ్రీ గోపాల్ దాస్, మాతా లింగమాంబ శిష్య బృందాలు, మఠం అధ్యక్షుడు కిశోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్‌బాబు, సభ్యులు మార్కండేయ, భగత్ శ్రీను, గణేశ్, గాయకులు దిలీప్ కుమార్, సర్సింగ్‌రావు, అశోక్, ఈశ్వర్, విజయ్ పాల్గొన్నారు.

NATIONAL CONSUMER DISPUTES REDRESSAL COMMISSION
Under the Consumer Protection Act, 2019
Upbhokta Nyay Bhawan 'F'-Block, General Pool Office Complex, INA, NEW DELHI-110023
Telephone No. : 011-24608801-04
Fax No.: 011-24651505, Email: ncdrc[at]nic[dot]in
Website: www.ncdrc.nic.in
Revision Petition No. 2327/2023
WITH
IA/12217/2023
E-daakhil Id: A23090010983
(Against the order dated 11 Jul 2023 in Appeal Number A/91/2023 of the State Commission Telangana)
ANDHRA BANK, NOW UNION BANK OF INDIA
.....Petitioner/Appellant
Versus
MRS. REKHA PATEL
.....Opposite Party/Respondent(s)
To
MRS. REKHA PATEL, W/o. Rukmanlal Patel, R/o.Plot No.G-4, Vijetha Towers, Krishnapuri Colony, West Moradpally, Secunderabad, Telangana.
NOTICE
WHEREAS ANDHRA BANK, NOW UNION BANK OF INDIA., vs. MRS. REKHA PATEL., have filed a Revision Petition No. 2327 of 2023 against the order dated 11-07-2023 in First Appeal No. 91 of 2023 of the State Commission, Telangana. The abovementioned Revision Petition is pending before the National Commission, New Delhi wherein you have been arrayed as Respondent.
WHEREAS this Commission has ordered vide order dated 08-05-2024 to effect service upon you by this Publication returnable on 26-09-2024.
NOW, THEREFORE, TAKE NOTICE that you are hereby directed to appear before this Commission in person or through your counsel/authorised representative on 26-09-2024 at 10.30 a.m., failing which the Petition will be disposed of ex-parte on merits.
Dated this the 20th June, 2024.
SECTION OFFICER